క్లుప్తంగా

రూ.63,800 ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ సభ్యులు

ఆమదాలవలస రూరల్: మండలంలో అక్కులపేట గ్రామానికి చెందిన వీరభద్రం ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. మృతుని తల్లి దండ్రులు పేదవారు కావడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న అక్కులపేట హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ సభ్యులు విరాళాలు సేకరించి రూ.63,800 ఆర్థికసాయాన్ని వీరభద్రం తల్లిదండ్రులకు ఆదివారం అందజేశారు. అక్కులపేట, శ్రీనివాసాచార్యులపేట గ్రామాల్లో కొంత మేర విరాళాలు సేకరించి మిగిలిన సొమ్మును సంస్థ సభ్యులు చందాలుగా వేసుకుని కుటుంబ సభ్యులకు అందించారు. సంస్థ సభ్యులను గ్రామస్తులు అభినందించారు. సంస్థ సభ్యులు సూర్యనారాయణ, ప్రకాశ్, కృష్ణ, మన్మధరావు పాల్గొన్నారు.

కళ్ల కలకలపై అప్రమత్తం



విద్యార్థి కళ్లను పరీక్షిస్తున్న వైద్యుడు వసంతరావు

పొందూరు: కళ్ల కలకలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆప్తాలమిక్ ఆఫీసర్ సప్పటి వసంతరావు సూచించారు. మండలంలోని లోలుగు కేజీబీవీ పాఠశాలలో శ్రీకాకుళం రోటరీక్లబ్, ప్రభావతి జాగృతి స్వచ్ఛంద సంస్థ సంయుక్తగా ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో కళ్ల కలకలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. స్టెరాయిడ్ ఉన్న కంటి చుక్కలను వాడకూడదని, సాధారణ యాంటీబయోటిక్ చుక్కలను మాత్రమే వాడాలని సూచించారు. సీ-విటమిన్ ఎక్కువగా ఉన్న పండ్లను ఎక్కువగా తినాలని సూచించారు. కేజీబీవీ సిబ్బంది పాల్గొన్నారు.

పక్కాగా ఓటర్ల జాబితా సర్వే



వివరాలు సేకరిస్తున్న వీఆర్వో రమేష్

బూర్జ: మండలంలోని తుడ్డలి గ్రామంలో ఆదివారం ఓటర్ల జాబితా సర్వే నిర్వహించారు. బీఎల్‌ఓ, వీఆర్వో వి.రమేష్ ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించారు. ప్రస్తుతమున్న ఓటరు జాబితాలో మృతులు, శాశ్వతంగా వలసవెళ్లిన వారి వివరాలు తెలుసుకున్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎంఈఓకు సన్మానం



ఎంఈఓను సన్మానిస్తున్న దృశ్యం

హిరమండలం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ ఎంఈఓగా ఉద్యోగోన్నతి పొందిన మూర్తిని హిరమండలంలోని ఆశ్రమ కోర్డినేటర్ సాయి బాబా, సభ్యులు బి.సురేష్, ఆశ్రమ వాసులు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆశ్రమ కోఆర్డినేటర్ మాట్లాడుతూ.. హిరమండలం ప్రభుత్వ ఉన్నత పాఠశాలను మూర్తి ఎంతగానో అభివృద్ధి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రసాదరావు, జగదీష్, సుశీల, జయరాం పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

సారవకోట: గ్రామాలలో సత్సంగ కార్యక్రమాలు నిర్వహించాలని విజయనగరం పట్టణానికి చెందిన అన్నపూర్ణదేవి సూచించారు. మండలంలోని బుడితి గ్రామంలో ఆధ్యాత్మిక విజ్ఞాన పీఠం, దివ్య జీవన సమాజం ఆధ్వర్యంలో ఆదివారం సత్సంగ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆమె మాట్లాడుతూ గ్రామాలలో ఆధ్యాత్మికత పెంపొందించాలన్నారు. బుడితి, కిన్నెరవాడ గ్రామాలలో ప్రతీ నెల సత్సంగ కార్యక్రమాలు చేపట్టడం శుభపరిణామం అన్నారు. అల్లు రామయ్య తదితరులు ఆధ్యాత్మిక ప్రసంగాలు చేశారు. జాడ మోహనరావు, మెండ సన్యాసి రావు పాల్గొన్నారు.

నడకతో సంపూర్ణ ఆరోగ్యం

శ్రీకాకుళం అర్బన్: యాంత్రిక జీవితంలో సంపూర్ణ ఆరోగ్యం ఇచ్చేది ఒక్క నడక మాత్రమేనని వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థలు 102 మాజీ గవర్నర్లు జి.ఇందిరాప్రసాద్, గుడ్ల సత్యనారాయణ, పి.జి.గుప్తా అన్నారు. ఆదివారం శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల మైదానంలో స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో వాకర్స్ క్లబ్స్ ప్రతినిధులు సమావేశమయ్యారు. 2025 సంవత్సరానికి గాను గవర్నర్ ఎంపిక కోసం వివిధ క్లబ్స్ ప్రతినిధులు అభిప్రాయాలు స్వీకరించారు. చేపట్టాల్సిన సామాజిక సేవలు వివరించారు.

ప్రభుత్వ బడుల్లో..

డిజిటల్ విద్య



ఐఎఫ్‌పీ నమూనా

- దృశ్య వీక్షణ ద్వారా విద్యార్థుల్లో సామర్థ్యాల పెంపు
- నాడు-నేడు ద్వారా సౌకర్యాల కల్పన
- సర్కారు పాఠశాలలకు 4జీ ఇంటర్నెట్ సౌకర్యం

సారవకోట: ఇప్పటివరకు శ్రీమంతుల బిడ్డలకే అందుబాటులో ఉన్న డిజిటల్ విద్య.. నేడు పేద విద్యార్థులకు కూడా అందుతోంది. సర్కార్ పాఠశాలల్లో 1వ తరగతి నుంచే స్మార్ట్ క్లాస్ రూములు అందుబాటులోకి రానున్నాయి. ఈ డిజిటల్ విప్లవం ద్వారా కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఏమాత్రం తీసిపోని విధంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కూడా ఉత్తమ విద్యా ప్రమాణాలు అందుకునే అవకాశం ఉంది.

సాంకేతిక విప్లవం..

పాఠశాలలు సాంకేతిక విప్లవాన్ని సృష్టించబోతున్నాయి. ఇన్నాళ్లు కేవలం ఉపాధ్యాయులు చెప్పింది శ్రద్ధగా ఆలకించడం, ఆపై అభ్యసనంపైనే విద్యార్థులు దృష్టిసారిస్తూ వస్తున్నారు. ప్రపంచ స్థాయిలో మన విద్యార్థులు పోటీపడాలంటే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాల్సిన ఆవశ్యకత ఉందని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పదేపదే చెబుతున్నారు. దీనికి అక్షరబద్ధం చేస్తూ విద్యాశాఖాధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ప్రయోగాలే కాకుండా దృశ్య వీక్షణ ద్వారా చిన్నారుల మెదడుపై బలమైన ముద్ర పడేలా, సామర్థ్యాల పెంపే లక్ష్యంగా వినూత్నమైన డిజిటల్ బోధన త్వరలో అందుబాటులోకి తీసుకురానున్నారు.

ప్రాథమికోన్నత పాఠశాలలకు స్మార్ట్ టీవీ, ఐఎఫ్‌పీలు అందజేయనున్నారు. వీటిని ఏర్పాటు చేయాలంటే ఆ తరగతి గదిలో ప్రాథమిక సౌకర్యాల కల్పనపై ప్రభుత్వం దృష్టి సారించింది. తరగతి గదిలో అవసరమైన ప్రాంతంలో విద్యుత్ సదుపాయం, పాఠశాలలకు 4జీ ఇంటర్నెట్ సదుపాయం కల్పించడం తదితర విషయాలపై సంబంధిత పాఠశాలల హెచ్ఎంలను నాడు-నేడు ఎస్ఎంటీ యాప్‌లో పొందుపర్చాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఆదేశించారు.

స్మార్ట్ టీవీలు, ఐఎఫ్‌పీలు అందించనున్న పాఠశాలల వివరాలు

మండలం	స్మార్ట్ టీవీలు	ఐఎఫ్ పీలు
ఆమదాలవలస	11	8
బూర్జ	4	7
హిరమండలం	5	2
జలుమూరు	6	5
కొత్తూరు	19	11
ఎల్ఎన్ పేట	2	5
మెళియాపుట్టి	8	10
నరసన్నపేట	5	6
పాతపట్నం	5	11
పోలాకి	7	7
పొందూరు	12	7
సారవకోట	7	8
సరుబుజ్జిలి	1	3

ఉపయోగం ఇలా..

బైజూస్‌తో ఒప్పందం కుదుర్చుకుని మాడ్యుల్‌ను విద్యార్థులకు ట్యాబ్‌ల రూపంలో అందించినప్పటికీ.. తరగతి గదిలో ఉపాధ్యాయుని సమక్షంలో పాఠ్యాంశాలను దృశ్య వీక్షణ ద్వారా చూడడం విద్యార్థులకు గొప్ప అనుభూతిని కల్పించబోతుంది. ఉపాధ్యాయులకు కూడా విద్యా బోధనలో అవసరమైన ప్రయోగాల కల్పన నేరుగా డిజిటల్ స్క్రీన్‌పై విద్యార్థులు చూసేందుకు అవకాశం కలగడం, దానిని ఉపాధ్యాయులు విద్యార్థులకు అవసరమయ్యే రీతిలో స్క్రీన్‌ని కొద్దిసేపు నిలిపి మరీ చూపించగలగడం కీలక అంశం. ఈ బోర్డును బ్లాక్ బోర్డులా ఉపయోగించవచ్చు, రాసిన దానిని చెరపవచ్చు, ,రాసిన విషయాన్ని సేవ్ చేసుకోవచ్చు. ఇంటర్‌నెట్ వినియోగించి కంప్యూటర్ మాదిరిగా వినియోగించవచ్చు, యూట్యూబ్, ఫోన్, ట్యాబ్‌లోని సమాచారం సైతం స్క్రీన్‌పై చూసేందుకు అవకాశం కలుగుతుంది.

తరగతి గదిలో డిజిటల్ ప్రపంచం



ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తయారు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ప్రభుత్వ పాఠశాలల తరగతి గదులలో డిజిటల్ ప్రపంచాన్ని చూడవచ్చు. ఐఎఫ్‌పీలను బ్లాక్, వైట్ బోర్డులుగా వాడుకోవచ్చు, సాంకేతికను జోడించి విద్యా బోధన చేస్తుండం ద్వారా భవిష్యత్‌లో మంచి ఫలితాలు వస్తాయి. సాంకేతిక పరికరాలను వినియోగిస్తూ ఉపాధ్యాయులు కీలక భూమిక పోషించినప్పుడే అనుకున్న లక్ష్యం నెరవేరుతుంది.

– ఎం.వి.రమణ, ఎంఈఓ, సారవకోట

గిరిజన గ్రామాల..

రహదారులకు మహర్దశ

- రూ.6.24 కోట్లతో రోడ్లు అభివృద్ధి
- ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ఎల్.ఎన్.పేట: పాతపట్నం నియోజకవర్గంలోని మారుమూల, కొండల్లో ఉన్న గిరిజన గ్రామాల రహదారుల అభివృద్ధికి రూ.6.24 కోట్ల నిధులు మంజూరయ్యాయని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి తెలిపారు. పాతపట్నంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె వివరాలు వెల్లడించారు. గిరిజన సంక్షేమ శాఖ ద్వారా రూ.5.42 కోట్లు, ఎంజీఎన్ఆర్ ఈజీఎస్ నిధులు, కమ్యూనిటీ హాల్, ఫ్లడ్ ప్రొటెక్షన్ వాల్ నిర్మాణానికి రూ.82 లక్షల నిధులు విడుదలయ్యాయన్నారు.

మంజూరైన నిధులు, పనుల వివరాలు..

- మెళియాపుట్టి మండలం వెంకటాపురం పంచాయతీ ముఖలింగాపురం జంక్షన్ నుంచి హడ్డివాడ గ్రామం వరకు 2.30 కిలో మీటర్ల మేర సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.1.75 కోట్లు.
- కేరాసింగి గ్రామం నుంచి కేరాసింగి గూడ 2.50 కిలో మీటర్ల రోడ్డుకు రూ.1.50 కోట్లు.
- పరశురాంపురం రోడ్డు నుంచి కేరాసింగి గ్రామం వరకు 1.50 కిలో మీటర్ల రోడ్డుకు రూ.92 లక్షలు.
- గొట్టిపల్లి పంచాయతీ నేలబొంతు-భీంపురం రోడ్డు నుంచి చందనగిరి వరకు 1.60 కిలో మీటర్ల రోడ్డుకు రూ.1.25 కోట్లు నిధులు మంజూరు అయ్యాయి.
- వెంకటాపురం గిరిజన పంచాయతీ ఎగువ బందపల్లి గిరిజన గ్రామంలో ఫ్లడ్ ప్రొటక్షన్ వాల్ నిర్మాణానికి రూ.9.75 లక్షల నిధులు విడుదలయ్యాయి.
- పాతపట్నం మండలంలోని ఎ.ఎస్ కవిటి పంచాయతీ నల్లబొంతు గిరిజన గ్రామంలో సామాజిక భవనం నిర్మానం కోసం రూ.15 లక్షలు.
- బద్దుమర్రి పంచాయతీ కొనంగి గిరిజన గ్రామంలో ఫ్లడ్ ప్రొటక్షన్ వాల్ నిర్మాణానికి రూ.10 లక్షలు.
- బద్దుమర్రి పంచాయతీ బాసగిట్టంగి గ్రామంలో ఫ్లడ్ ప్రొటక్షన్ వాల్ నిర్మాణానికి రూ.9.75 లక్షలు.
- శోభ పంచాయతీ లక్ష్మణగూడ గిరిజన గ్రామంలో ఫ్లడ్ ప్రొటక్షన్ వాల్ నిర్మాణానికి రూ.9 లక్షలు.
- కొత్తూరు మండలం అల్లి పంచాయతీ తామరగూడ గిరిజన గ్రామంలో ఫ్లడ్ ప్రొటక్షన్ వాల్ నిర్మాణానికి రూ.9.75 లక్షల నిధులు మంజూరు అయ్యాయి.

అభివృద్ధికి ప్రాధాన్యం



సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారం చేపట్టినప్పటి నుంచి గిరిజనుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇచ్చారని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం, ఫ్లడ్ ప్రొటక్షన్ వాల్ నిర్మాణాలు, గిరిజనులకు పోడు పట్టాలు, పోడు పట్టాలున్న గిరిజనులకు రైతు భరోసా వర్తింపు, బ్యాంకు రుణాలు అందజేయటం.. ఇలా గిరిజన సంక్షేమానికి ఎంతో ప్రాధాన్యం ఇచ్చారు.

– రెడ్డి శాంతి, ఎమ్మెల్యే, పాతపట్నం

ముగ్గురు జూదరుల అరెస్టు

- రూ.61 వేలు స్వాధీనం

నరసన్నపేట: స్థానిక పెద్దపేట వీధిలో నిర్వహిస్తున్న జూద శిబిరంపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. ముగ్గురు జూదరులను అరెస్టు చేశామని నరసన్నపేట ఎస్ఐ వై.సింహాచలం తెలిపారు. వారి వద్ద రూ.61,570 స్వాధీనం చేసుకుని సీజ్ చేశామన్నారు. జూదం, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

మీనామృతం తయారీపై అవగాహన



కొత్తూరు: ఘనామృతాన్ని తయారు చేస్తున్న మహిళా రైతులు



సరుబుజ్జిలి: మీనామృతం తయారీని రైతులకు వివరిస్తున్న దృశ్యం

సరుబుజ్జిలి: మీనామృతం పంటలకు పిచికారీ చేయడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చునని ప్రకృతి వ్యవసాయ మండల ఇన్‌చార్జి బి.లలిత అన్నారు. మండలంలోని రావివలస గ్రామంలో మీనామృతం తయారీ విధానం గురించి రైతులకు ఆదివారం అవగాహన కల్పించారు. బెల్లం, చేపల వ్యర్థాల్లో కొద్దిగా నీటిని కలిపి ఒక కుండలో నిల్వ చేయాలన్నారు. నిల్వ చేసిన మీనామృతాన్ని 10 రోజుల తరువాత వడపోసి, వాటిని 100 లీటర్ల నీటిలో కలిపి పొలంలో, కూరగాయల మొక్కలకు పిచకారీ చేయాలన్నారు. ఇలాంటి మీనామృతం వల్ల కలుషితం లేని పంటలను పొందవచ్చునన్నారు. ఐపీఆర్‌పీ టి.తిరుపతిరావు, రైతులు పాల్గొన్నారు.

తొగిరి గ్రామంలో..

సారవకోట: ప్రకృతి వ్యవసాయంలో భాగంగా ఆదివారం మండలంలోని తొగిరి గ్రామంలో మీనామృతం తయారీపై రైతులకు అవగాహన కల్పించారు. మీనామృతం తయారీ, పంట పొలాల్లో దానిని ఏలా వినియోగించాలి, వినియోగం వల్ల కలిగే లాభాలను ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తెలియజేశారు.

కొత్తూరులో..

కొత్తూరు: ప్రకృతి వ్యవసాయంపై రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని కొత్తూరు క్లస్టర్ ఐసీఆర్‌పీ ఎ.మాధవి అన్నారు. మండల కేంద్రంలోని రైతులకు ఘణామృతాన్ని తయారుచేసే విధానాన్ని ఆదివారం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయంపై రైతులకు ప్రభుత్వం అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, రైతులకు ప్రోత్సహిస్తుందన్నారు.

భారీ వర్షం

పాతపట్నం: మండలంలో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో రెండు గంటల సమయం ఏకధాటిగా వర్షం కురిసింది. వాహనాలు రాకపోకలు నిలిచిపోయాయి. కొరసవాడ, కాగువాడ, పెద్ద సీది, రొంపివలస, గంగువాడ, ఆర్.ఎల్.పురం, తెంబూరు తదితర గ్రామాల్లోనూ భారీ వర్షం కురిసింది. ఇటీవల వారం రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి.



పాతపట్నం: పాతపట్నంలో కురుస్తున్న వర్షం



సరుబుజ్జిలి: సరుబుజ్జిలి జంక్షన్ వద్ద నిలిచిన వర్షంనీరు

సరుబుజ్జిలిలో కుండపోత..

సరుబుజ్జిలి: మండలంలో ఆదివారం కుండపోత వర్షం పడటంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. మండలంలో సరుబుజ్జిలి జంక్షన్, కొత్తకోట, షలంత్రి, పాలవలస, పురుషోత్తపురం, రొట్టవలస తదితర గ్రామాల్లో వర్షం కురవడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పంట పొలాలకు ఈ వర్షం ఉపయోగంగా ఉంటుందని రైతులు అన్నారు. సరుబుజ్జిలి జంక్షన్‌లో నీరు నిల్వ కావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడ్డారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ



ఆమదాలవలస: మొక్కలు నాటుతున్న సత్యసాయి సేవా సమితి సభ్యులు



ఎల్.ఎన్.పేట: మొక్కలు నాటుతున్న టెస్ అధ్యక్షులు పెద్దకోట వెంకటరావు

ఆమదాలవలస: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సత్యసాయి సేవా సమితి జోనల్ కన్వీనర్ ఎం.జనార్దనరావు పిలుపునిచ్చారు. లక్ష్మీనగర్, మెట్టక్కివలస సత్యసాయి సేవా సమితిల ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక తహసీల్దారు కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. సేవా సమితి స్టేట్ విద్యాజ్యోతి ఇంచార్జి ఎస్.గురుప్రసాద్, జిల్లా జాయింట్ యూత్ కో ఆర్డినేటర్ బి.సాయికృష్ణ, జోనల్ యూత్ కో ఆర్డినేటర్లు జ్యోతి, పవన్, షణ్ముఖ, లక్ష్మీనగర్ భజన మండలి కన్వీనర్ వాసు, మెట్టక్కివలస కన్వీనర్ కామావధానులు, కార్యవర్గ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఐదు మొక్కలు పెంచాలి

ఎల్.ఎన్.పేట: ప్రతి ఒక్కరూ ఏడాదికి ఐదు మొక్కలు నాటి వాటిని పెంచి పెద్దవి చేయాలని ఠాగూర్ ఎడ్యుకేషనల్ అండ్ సర్వీస్ సొసైటీ (టెస్) అధ్యక్షుడు పెద్దకోట వెంకటరావు పిలుపునిచ్చారు. మండలంలోని తురకపేట సెంటర్‌లోని అసర్లవాని చెరువు గట్టుపై ఉన్న శ్మశాన వాటికి వద్ద ఆదివారం మొక్కలు నాటారు. మేరా మట్టి – మేరా దేశ్, కార్గిల్ దినోత్సవం సందర్భంగా శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని నెహ్రూ యువ కేంద్రం జిల్లా యువజన అధికారి కె.వి.ఉజ్వల్ సూచనల మేరకు మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. గ్రామ పెద్దలు, యువత ముందుకు వస్తే గ్రామీణ ప్రాంతాల్లోని చెరువులు, కాలువ గట్లు, రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటేందుకు తమ సంస్థ సిద్ధంగా ఉందన్నారు. సంస్థ సభ్యుడు అన్నెపు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అధునాతన వైద్యం

- నరసన్నపేట వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రిలో రోజురోజుకూ పెరుగుతున్న ఓపీ
- సకాలంలో అందుతున్న వైద్య సేవలు



ఆస్పత్రికి మంజూరైన ఫుల్లీ ఎనలైజర్ మెషిన్



ఆస్పత్రి ల్యాబ్‌లో రక్త పరీక్షలు చేస్తున్న సిబ్బంది

నరసన్నపేట: టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులు ఏమైనా పరీక్షలు చేయించుకోవాలంటే ఎక్కడో ఉన్న మెడాల్ ల్యాబ్‌కు పరుగులు పెట్టాల్సి వచ్చేది. శ్యాంపిల్స్ ఇచ్చినప్పటికీ రెండు రోజుల తరువాత ఫలితాలు వచ్చేవి. అప్పటికే పుణ్యకాలం గడిచిపోయేది. పేరుకే ఫలితాలు తప్ప.. రోగులకు అంతగా వినియోగపడేవి కావు. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారింది. ఏ పరీక్ష అయినా నరసన్నపేటలోని వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు అందుబాటులోకి వచ్చాయి. నూతనంగా పలు పరీక్షలకు చెందిన పరికరాలు మంజూరు చేయడంతో రోగులకు వివిధ పరీక్షలు సులువుగా లభిస్తున్నాయి. అంతే కాకుండా కొద్ది నిమషాల్లోనే ఫలితాలు వస్తున్నాయి. ఆస్పత్రికి వచ్చే పేదలకు అత్యవసర వైద్యం అందించేందుకు వేగంగా టెస్ట్ రిపోర్టులు ఉండాలి. అధునాతన టెస్టింగ్ పరికరాలు అందుబాటులో ఉన్నప్పడే వేగంగా వైద్యం అందుతుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్యానికి పెద్దపీట వేయడం, ఆస్పత్రుల్లో సౌకర్యాలు కల్పించేందుకు ప్రత్యేక దృష్టి సారించడంతో ఈ మెషీన్లు అందుబాటులోకి వచ్చాయి. పేదలకు సకాలంలో వైద్యం అందించేందుకు వైద్యులు చర్యలు తీసుకుంటున్నారు.

పది నిమిషాల్లోనే రిపోర్టులు..

నూతనంగా ఆస్పత్రికి మంజూరైన పరికరాల ద్వారా టెస్ట్ రిపోర్టులు పది నిమిషాల నుంచి 20 నిమిషాల్లోనే వస్తున్నాయి. ప్రస్తుతం ఆస్పత్రిలో 25 రకాల పరీక్షలు నిర్వహిస్తున్నారు. వీటిల్లో కిడ్నీకి సంబంధించి బ్లడ్ యూరియా, సీరమ్ క్రియాటినిన్, లివర్‌కు సంబంధించి సీరం బిలిరోబిన్, కొలస్ట్రాల్, లిపీడ్ ప్రొఫైల్ టెస్ట్‌లు అందుబాటులో ఉన్నాయి. గర్భిణులకు సంబంధించి హెచ్‌బీ, బ్లెడ్ గ్రూపింగ్, బ్లడ్ షుగర్, వీడీఆర్ఎల్, హెపటైటీస్ బీ, హెచ్ఐవీ, హెచ్‌సీవీ, యూరిన్ ఆల్బ్యూమిన్, సుగర్ మైక్రోస్కోపిక్ ఎగ్జామ్, జ్వరాలకు సంబంధించి మలేరియా, టైఫాయిడ్, డెంగీ వంటి పరీక్షలు చేస్తున్నారు. ఇప్పుడు వివిధ రుగ్మతలకు సంబంధించి ఒకేసారి పలు శాంపిల్స్‌ను నూతనంగా ఏర్పాటు చేసిన పరికరాల ద్వారా అందుబాటులోకి తెచ్చారు. ఆటో ఎనలైజర్, ఈఎస్ఆర్ ఎన్‌లైజర్, సెమీ ఆటో ఎనలైజర్, యూరిన్ ఎనలైజర్ మెషిన్లతోపాటు పలు మిషన్లు వినియోగంలోనికి వచ్చాయి. బయోకెమిస్ట్రీ పరీక్షలు కూడా నిర్వహిస్తున్నారు.

రోగులు వినియోగించుకోవాలి



నరసన్నపేట వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రిలో నిపుణులైన వైద్యులు అందుబాటులో ఉన్నారు. వివిధ రకాల వైద్య పరీక్షలు అందుబాటులో ఉన్నాయి. అధునాతన పరికరాల ద్వారా టెస్ట్‌లు చేస్తున్నాం. రోగులు వీటిని వినియోగించుకోవాలి. ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి డబ్బులు అధికంగా చెల్లించకుండా ప్రభుత్వ ఆస్పపత్రి సేవలను వినియోగించుకోవాలి. ప్రస్తుతం రోజూ సరాసరిన 60 మంది రోగులు వస్తున్నారు. వారికి 310 వరకు వివిధ పరీక్షలు చేస్తున్నాం. త్వరలో ఫుల్లీ ఎన్‌లైజర్ మెషిన్ కూడా అందుబాటులోని వస్తుంది.

– జయశ్రీ, ఆస్పత్రి సూపరింటెండెంట్

అన్నీ పరీక్షలు ఉచితంగా చేస్తున్నారు



ఆస్పత్రిలో అన్ని రక్త పరీక్షలు ఉచితంగా చేస్తున్నారు. టెస్ట్ ఫలితాలు కూడా కొద్ది నిమిషాల్లోనే ఇస్తున్నారు. ఇతర ప్రాంతాల నుంచి వస్తున్న మాకు ఆస్పత్రిలోనే పరీక్షలు అందుబాటులో ఉంటున్నాయి. గతం మా అక్కను ఈ ఆస్పత్రికి తీసుకువచ్చాం. అప్పుడు పరీక్ష ఫలితాలు రెండు రోజులకు వచ్చాయి. ఇక్కడ శ్యాంపిల్స్ తీసి పరీక్షల కోసం మరో ఊరుకి పంపేవారు. టెస్ట్ రిపోర్టు వచ్చే సరికి బాగా ఆలస్యం అయ్యేది. ఇప్పుడు నేను చేయించుకున్నా. కొద్ది నిమిషాల్లోనే టెస్ట్ రిపోర్టులు ఇచ్చారు.

–సీహెచ్ భారతి, రోణంకి గ్రామం

వైద్య సేవలు బాగున్నాయి



నేను ప్రతీనెలా వైద్య పరీక్షలు చేయించుకుంటున్నాను. పరీక్షలు బాగా చేస్తున్నారు. డబ్బులు ఖర్చు కావడం లేదు. పేదలకు వైద్య పరీక్షలు అందుబాటులో ఉన్నాయి. గతంలో అయితే నానా అవస్థలు పడే వారం.

– జి.వందన, గర్భిణి, ఎలమంచిలి గ్రామం

అరసవల్లిలో భక్తుల సందడి

అరసవల్లి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లి సూర్యనారాయణ స్వామి సన్నిధిలో ఆదివారం భక్తులు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇతర ప్రాంతాల నుంచి తరలివచ్చిన వందలాది మంది భక్తులు తమ కుటుంబాలతో సహా మొక్కులు చెల్లించుకున్నారు. అంతరాలయంలో స్వామి వారి మూలవిరాట్టుకు ప్రత్యేక అలంకరణలతో సర్వదర్శనాలకు ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. భక్తుల గోత్రనామాలతో పూజలు చేయించారు. సంపూర్ణ ఆరోగ్యం కోసం కొందరు భక్తులు సూర్యనమస్కార పూజలు చేయించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఈవో వి.హరిసూర్యప్రకాష్ ఏర్పాట్లు చేశారు. కేశఖండనశాలలో భక్తులు తలనీలాలను సమర్పించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. స్వామి వారిని రాష్ట్ర గ్రేహౌండ్స్ అడిషనల్ డీజీపీ ఆర్.కె.మీనా కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలు ప్రత్యేక స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. ఈయన వెంట జిల్లా అడిషనల్ ఎస్పీ తిప్పేస్వామి, డీఎస్పీ ప్రసాదరావు, ఎస్సై బలివాడ గణేష్ తదితరులున్నారు.

నిలిచిన రాకపోకలు

పొందూరు: మండలంలో గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు తాడివలస-కింతలి రహదారిలో చిన్నబొడ్డేపల్లి వద్ద అండర్ పాసేజ్ రైల్వే బ్రిడ్జి కింద భారీగా వర్షం నీరు చేరింది. వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. సుమారు 10 గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఈ నీటిలో ఆటో చిక్కుపోవడంతో రోడ్డు పైకి తెచ్చేందుకు అవస్థలుపడ్డారు.



అండర్ పాసేజ్ రైల్వే బ్రిడ్జి కింద నిలిచిన నీరు